క్లుప్తంగా

నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న మహేందర్‌గౌడ్, కరుణాకర్

హుజూరాబాద్‌రూరల్: మండలంలో రెండో విడుత దళితబంధు పథకం నిధులు వెంటనే విడుదల చేయాలని చెల్పూర్, రంగాపూర్ సర్పంచులు నేరెళ్ల మహేందర్ గౌడ్, బింగి కరుణాకర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ.. పథకానికి సంబంధించిన లబ్ధిదారులకు గ్రామస్థాయి అధికారులు క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ మండల పరిషత్ కార్యాలయంలో క్లియరెన్స్ కావడం లేదన్నారు. అధికారులు స్పందించాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌ను విమర్శించొద్దు



మాట్లాడుతున్న న్యాత సుధాకర్

గన్నేరువరం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నేతృత్వంలో గన్నేరువరం మండలం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని పార్టీ నాయకుడు న్యాత సుధాకర్ అన్నారు. గన్నేరువరంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అధికార పార్టీని విమర్శించే ముందు కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఏం పనులు చేపట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. మండల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే మండల కేంద్రం నుంచి కరీంనగర్ వరకు బ్రిడ్జి నిర్మాణానికి ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ఫ్లెక్సీలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫొటోలపై రాంగ్ గుర్తు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి 19న టెండర్ ప్రక్రియ పూర్తి కానుందని, స్థానిక నాయకులను రెచ్చగొడుతూ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నారని విమర్శించారు. వ్యక్తిగత దూషణలకు పాల్పడితే సహించమని హెచ్చరించారు. సమావేశంలో సహకార సంఘం డైరెక్టర్ రవిగౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు భూమయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు న్యాలపట్ల శంకర్‌గౌడ్, కల్లెపల్లి కొమురయ్య, నగునూరి మల్లయ్య, నక్క దామోదర్, బుర్ర మల్లేశం, బోయిని కుమార్, బోయిని బాలయ్య, మహంకాళి ప్రభాకర్, కల్లెపల్లి మల్లయ్య, రాగటి వీరయ్య పాల్గొన్నారు.

కల్వల గ్రామ శివారులో ఆయిల్‌పామ్ సాగు



మొక్కలు నాటుతున్న రైతు

శంకరపట్నం: మండలంలోని కల్వల గ్రామ శివారులో ముస్కు రాజిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం ఆయిల్‌పామ్ సాగు ప్రారంభించారు. రెండెకరాల ఇరవై గుంటల భూమిలో రైతు దంపతులు, సర్పంచ్ భద్రయ్య, ఏఈవో రాజ్‌కుమార్ ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలని సూచించారు.

‘డబుల్’ ఇళ్లు.. పూర్తికి ఎన్నేళ్లు?

- ఐదేళ్లవుతున్నా నిర్మాణ పనుల్లో అలసత్వం
- పిల్లర్లు, స్లాబ్, గోడల స్థాయిలో ఇళ్లు
- ఎంపికైన లబ్ధిదారుల ఎదురుచూపు
- పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాలు

చొప్పదండి: గూడు లేని నిరుపేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తోంది. కానీ చొప్పదండి పట్టణంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. ఐదేళ్ల క్రితం సుమారు వందకు పైగా డబుల్ ఇళ్ల నిర్మాణం చేపట్టినా వివిధ కారణాలతో కొనసాగుతూనే ఉంది. పట్టణంతో పాటు గుమ్లాపూర్, కొలిమికుంట, రుక్మాపూర్, చాకుంట, కాట్నపల్లి, వెదురుగట్ట, భూపాలపట్నం గ్రామాలకు చెందిన లబ్ధిదారులను ఇప్పటికే ఎంపిక చేశారు. ఆరేళ్ల క్రితం ఐదు గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేయగా తాజాగా మిగిలిన గ్రామాల్లోనూ లబ్ధిదారులను ఎంపిక చేశారు. పైగా ఎంపికైనవారికి డబుల్ ఇళ్లను లాటరీ పద్ధతిలో కేటాయించారు.

నిలిచిపోయిన నిర్మాణాలు

ఇళ్ల నిర్మాణం మొదలైనప్పటి నుంచి గ్రహణం పట్టుకుంది. అప్పుడు మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లను తెలంగాణ ప్రభుత్వం తీసుకొని డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించిందని ఆరోపిస్తూ ప్లాట్ల లబ్ధిదారులు నిరసనలు తెలిపారు. ఇక అప్పటి నుంచి ఇళ్ల నిర్మాణ పనులు కొన్ని స్లాబ్ వరకు, మరికొన్ని గోడల వరకూ మాత్రమే కాగా ఏడు నెలల క్రితం కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు ఇళ్లను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినా పనుల్లో పురోగతి లేదు.



గోడల వరకే పరిమితమైన పనులు

లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది. ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో వాటిని పూర్తి చేసేందుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. సాంకేతిక సమస్యలు రాకుండా ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– అంబటి రజిత, తహసీల్దార్, చొప్పదండి



స్లాబ్ వరకు నిర్మాణం



పిల్లర్ల స్థాయిలో ఇళ్ల నిర్మాణం

ఇంకెన్ని రోజులకు పూర్తయ్యేనో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు ఇంకెన్ని రోజుల్లో పూర్తవుతాయనే ఆందోళనలో లబ్ధిదారులు ఉన్నారు. గతంలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో మళ్లీ టెండర్ ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన నిధులతో ఇళ్లు పూర్తయ్యే అవకాశం లేక పోవడంతో అధికారులు ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నారు.

నూతన కమిటీ



జనగాం రమేశ్

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామ గౌడ సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జనగాం రమేశ్, కోశాధికారిగా బత్తిని వెంకటేశ్, సభ్యులుగా మొలుగూరి శ్రీనివాస్, మొలుగూరి తిరుపతి, మొలుగూరి రాజేందర్, దుర్గపు రవి, మొలగూరి అనిల్, కోడూరి యాదగిరిని ఎన్నుకున్నామని సంఘం నాయకులు తెలిపారు.

కేశవపట్నం కేజీబీవీ ప్రత్యేక అధికారిగా మాధవి



మాధవి

శంకరపట్నం: కేశవపట్నం కేజీబీవీ ప్రత్యేక అధికారిగా మాధవి విధుల్లో చేరారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో పనిచేసిన మాధవి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన జ్యోతి ఓదెల మండలానికి బదిలీ అయ్యారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

వీణవంక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను హెచ్‌ఎం పులి అశోక్‌రెడ్డి సోమవారం అందజేశారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి గ్రామంలో బడిబాట నిర్వహించారు. పాఠశాలలో చేరిన నూతన విద్యార్థులకు హెచ్‌ఎం సొంత ఖర్చులతో నోట్‌బుక్స్ అందించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన మెరుగైన వసతులున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముల్కల కుమార్, శాంత తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఘన స్వాగతం



చొప్పదండి: విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



రామడుగు: గోపాల్‌రావుపేటలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా ఉపాధ్యాయులు పువ్వులు, బెలూన్లతో వినూత్న రీతిలో స్వాగతం పలికారు. పాఠశాల గేటు వద్దనే విద్యార్థులకు స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలిరోజు పాఠశాలకు 35 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెచ్‌ఎం కరుణ పూలు అందించారు. మధ్యాహ్న సమయానికి ఎండ వేడి పెరగడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లి పోయారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వేణుకుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణలోని సరస్వతి గుడి వద్ద గాయత్రీ హోమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఎలబాక ప్రసాద్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షుడు అవాల రాజిరెడ్డి, కార్యదర్శి దాసరి రవీందర్, పాఠశాల ప్రధానాచార్యులు గడికందుల సుదర్శన్, ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్, గుండా తిరుపతయ్య, బుర్ర శివయ్య, కేతిపెల్లి మాధవరెడ్డి, సారంగపాణి, దొంతుల రాజుకుమార్ గర్రెపల్లి నిరూపరాణి, తదితరులు పాల్గొన్నారు.

2 కే రన్ విజయవంతం



హుజూరాబాద్: 2 కే రన్ ప్రారంభిస్తున్న కౌశిక్‌రెడ్డి



మానకొండూర్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



చొప్పదండిలో ఎమ్మెల్యే రవిశంకర్, నాయకులు

హుజూరాబాద్: రాష్ట్ర పోలీసుల సేవలు భేష్ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 2కే రన్‌ను ప్రారంభించారు. పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. ప్రభుత్వం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం షీ టీంలు, బ్లూకోల్ట్స్ పోలీసులు, ఫ్రెండ్లీ పోలీసు ప్రవేశపెట్టిందని తెలిపారు. అనంతరం 2కే రన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ విజయ, మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక, వైస్ చైర్ పర్సన్ నిర్మల, సీఐలు బొల్లం రమేష్, బర్మాటి రమేష్, సురేష్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సింగిల్ విండో చైర్మన్ కొండాల్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, వివోలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: అభివృద్ధి పథంలో మానకొండూర్ నియోజకవర్గం రాష్ట్రంలో అగ్రగామిగా ఉందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మానకొండూర్‌లో సోమవారం 2 కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మానకొండూర్ పల్లెమీద నుంచి మానకొండూర్ చెరువుకట్ట వరకూ నిర్వహించిన రన్‌లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తుందని, శాంతి భద్రతల విషయంలో జిల్లాలో ముందజలో ఉందన్నారు. అన్ని వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. అందులో భాగంగానే పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసిందని, పోలీసులకు ప్రత్యేక వాహనాలు కల్పించిందన్నారు. వాహనాలు సమకూర్చుకోవడంలో పోలీసులు సఫలీకృతం అయ్యారని, రోడ్ల సమస్య ఉన్నా త్వరలోనే ఆ సమస్య కూడా తీరుతుందన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, మేలు చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని సూచించారు. జడ్పీటీసీ శేఖర్‌గౌడ్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, సీఐ రాజ్‌కుమార్, ఎస్సైలు తిరుపతి, ప్రమోద్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, యువకులు రన్‌లో పాల్గొన్నారు.

చొప్పదండి: మండల కేంద్రంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన 2 కే రన్ విజయవంతమైంది. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రన్‌ను ప్రారంభించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి మార్కెట్ చౌరస్తా వరకు రన్ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష ఆర్థికసాయం వర్తింపజేయాలి

చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అందిస్తున్న రూ.లక్ష ఆర్థికసాయం గౌడ కులస్తులకు వర్తింపజేయాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు టి. తిరుపతి కోరారు. సోమవారం చిగురుమామిడిలో మాట్లాడుతూ. గీత కార్మికులకు పూర్తి సబ్సిడీ రుణం అందించాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని, ఇప్పటివరకు గౌడ కులస్తులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రుణాలు అందలేదన్నారు.ప్రతి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, గౌడ కులానికే కార్పొరేషన్ లేదన్నారు. సమావేశంలో గౌడ సంఘం మండల ఉపాధ్యక్షుడు బి.తిరుపతి, రాజయ్య, రమేశ్, తిరుపతి, రాజయ్య ఉన్నారు.

మెట్‌పల్లిలో గడపగడపకూ కాంగ్రెస్

శంకరపట్నం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో సోమవారం గడపగడపకూ కాంగ్రెస్‌లో భాగంగా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బీఆర్ఎస్, బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే ఉన్నాయి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఏవని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని, రూ.ఐదు వందలకే సిలిండర్, పంటలకు గిట్టుబాట ధర అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బస్వయ్య, జహంగీర్, మాజీ సర్పంచ్ పోచయ్య, శ్రీనివాస్, సంతోష్, ఓదెలు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొత్త మాధవరెడ్డి ఇటీవల మృతిచెందారు. సోమవారం కవ్వంపల్లి సత్యనారాయణ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట రామిడి తిరుమల్‌రెడ్డి, మహేందర్ తదితరులున్నారు.

కొత్తగట్టులో పోచమ్మ బోనాలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో సోమవారం రాత్రి ముదిరాజ్ కులస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో ఆలయానికి తరలి వెళ్లారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



శంకరపట్నం: బోనాలతో మహిళలు

ప్రత్యేక పూజలు

మానకొండూర్: పెద్దమ్మతల్లి జాతరలో భాగంగా సోమవారం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ వేర్వేరుగా పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. వెంట సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ నెల్లి మురళి, ఎంపీటీసీలు పిట్టల కవితమధు, ఉండిటి సులోచన శ్యాంసన్ నాయకులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

గంగాధర: మండలంలోని నారాయణపూర్ గ్రామ సర్పంచ్ నజీర్ హుస్సేన్ కరీంనగర్ డిపో మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని మేనేజర్‌ను కోరారు. గ్రామం నుంచి సుమారు 45 మంది విద్యార్థులు మోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్నారని బస్సు సౌకర్యం లేకపోవడంతో ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారని వివరించారు. గతేడాది కూడా వినతిపత్రం ఇచ్చినా బస్సురాలేదని ఈ విద్యా సంవత్సరమైనా బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు.



వినతిపత్రం అందజేస్తున్న నజీర్‌హుస్సేన్

కొత్త కమిటీకి బాధ్యతలు అప్పగించాలి

హుజూరాబాద్: హుజూరాబాద్ కిరాణా వర్తక సంఘం లెక్కలు, బాధ్యతలు వెంటనే కొత్త కమిటీకి అప్పగించాలని సంఘం అధ్యక్షుడు శీల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంఘం ఎన్నికలు జరిగి చాలా కాలమైనప్పటికీ పాత అధ్యక్షుడు చందా గాంధీ సంఘం లెక్కలు, డబ్బులు, బాధ్యతలను తమకు ఇప్పటివరకు అప్పగించలేదని చెప్పారు. ఈ విషయమై పలుపార్లు అడిగినా పట్టించుకోకుండా తానే అధ్యక్షుడినని చెబుతున్నాడని, కొత్త కమిటీ ఎన్నిక చెల్లదని అంటున్నారని తెలిపారు. సంఘానికి డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో షెట్టర్లు ఉన్నాయని, వాటికి సంబంధించిన రూ.6 లక్షల లెక్క, ఆదాయం ఏం చేశారో చెప్పాల్సి ఉందన్నారు. చందా గాంధీ రాజీనామా పత్రం సమర్పించి కొత్త కమిటీ ఎన్నికలో తనను బలపరిచాడంతోపాటు ఎన్నికల్లో ఓటు వేశాడని తదనంతరమే కొత్త కమిటీ ఎన్నిక జరిగిందని స్పష్టం చేశారు. గాంధీ కంటే ముందు పనిచేసిన అధ్యక్షులు కొత్త కమిటీలకు లెక్కలు, బాధ్యతలు అప్పగించారని వెల్లడించారు. కానీ గాంధీ తానే అధ్యక్షుడినని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఈవిషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోకుండా దుర్భాషలాడారని వివరించారు. వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, కొత్త కమిటీకి లెక్కలు, బాధ్యతలు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో కిరాణ వర్తక సంఘం కార్యదర్శి శశిధర్, సభ్యులు కృష్ణమూర్తి, ప్రభాకర్, మహేష్, శ్రవణ్, సాగర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.